# అవినీతి ఊబిలో ప్రభుత్వం

## ❑ పంపకాల్లో తేడాలే మంత్రుల మధ్య చిచ్చు

## ❑ కళావెంకట్రావు, బీదా రవిచంద్ర ధ్వజం



ఎన్టీఆర్ ప్రాంగణంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న తేదేపా నాయకులు

**గ్రామీణమంగళగిరి, న్యూస్ టుడే:** అవినీతి ఊబిలో వై.ఎస్. రాజశేఖరరెడ్డి ప్రభుత్వం కూరుకుపోయిందని తెదేపా శాసనసభా పక్ష ఉపనాయకుడు కళా వెంకట్రావు పేర్కొన్నారు. మండలంలోని కాజ పరిధిలోని ఎన్టీఆర్ ప్రాంగణంలో యువగర్జన సదస్సు ఏర్పాట్లను పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు డాక్టర్ అల్లాడి రాజ్ కుమార్, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు బీదా రవిచంద్ర, ఆలపాటి రాజేంద్రప్రసాద్, ప్రాంగణం కన్వీనర్ మాదల రాజేంద్రలతో కలిసి శుక్రవారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్, భూములు చాలక ఆఖరుకు ఇసుకను కూడా మంత్రులు తినేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇసుక అక్రమాల్లో వాటాల పంపిణీలో తేడాలే మంత్రుల మధ్య కొట్లాటకు దారితీశాయని తెలిపారు. ఇది కాంగ్రెస్ దిగజారుడుతనానికి నిదర్శనమని చెప్పారు. మనదేశంలో 60శాతం యువత ఉందని, దీన్ని బట్టి చూస్తే మనకు మానవ వనరులు సమృద్ధిగా ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు చూపడంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. యువగర్జనలో ఇచ్చే సందేశాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాలకు యువత తీసుకెళుతుందని, తద్వారా వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్కు ప్రజలు బుద్ధిచెపుతారని కళావెంకట్రావు చెప్పారు. తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు బీదా రవిచంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో 2.5 లక్షల ఉద్యోగాలు, 1.20 లక్షల బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగున్నరేళ్ళు కాలయాపన చేసిందని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ని గద్దె దించేందుకు యువత చైతన్యవంతులవ్వాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. మాజీ మంత్రి శనక్కాయల అరుణ, పార్టీ నాయకులు దానబోయిన సుందరరావు యాదవ్, కోనంకి శ్రీనివాసరావు, మాదల రమేష్, నందం అబద్దయ్య, కొత్తపల్లి శ్రీనివాసరావు, పెదబాబు, తదితరులు పాల్గొన్నారు.